ఏఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ




పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2: జిల్లా ఏఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుకొండ డీఎస్పీగా పనిచేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లా ఏఎస్పీగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో ఇక్కడ ఏఎస్పీగా పనిచేస్తున్న విష్ణు ఏసీబీకి బదిలీపై వెళ్లారు.

కట్టుకునోళ్లకు కట్టుకున్నంత..!

జగనన్న లే అవుట్‌లో ఆక్రమణల పర్వం

- అడ్డగోలుగా కట్టడాలు
- షాపింగ్ కాంప్లెక్స్‌లు, భారీ భవంతుల నిర్మాణం
- లబ్ధిదారుల కన్నా.. ఆక్రమణదారులే ఎక్కువ
- చోద్యంచూస్తున్న అధికారులు



ఎర్రగుట్టపల్లి జగనన్న లే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు



విశాలమైన భవంతి

కదిరి

గత వైసీపీ పాలనలో ఊరూరా భూకబ్జాలేనన్నది బహిరంగ రహస్యమే. జగనన్న లేఅవుట్లలో అయితే వైసీపీ నాయకులు స్థలాలు పంచేసుకున్నారు. అందినకాడికి అమ్మేసుకుని, సొమ్ము చేసుకున్నారు. వారి అక్రమాల కారణంగా జగనన్న లేఅవుట్లలో ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, భారీ భవంతులు వెలిశాయి. ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి సెంటు చొప్పున స్థలం ఇస్తే.. ఏకంగా ఐదు సెంట్లలో ఒక్కో ఇల్లు భవంతిలాగా కట్టేసుకున్నారు. వెరసి.. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్టపల్లి సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారుల కన్నా.. ఆక్రమణదారులే ఎక్కువైపోయారు. అనుమతిలేని నిర్మాణాలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. ఐదేళ్లుగా కొంతమంది నాయకులు ఇష్టారాజ్యంగా ప్లాట్లు అమ్ముకుని, రూ.కోట్లు వెనకేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆక్రమణదారులే ఎక్కువ

దాదాపు 35 ఎకరాల్లో ఎర్రగుట్టపల్లి జగనన్న లేఅవుట్ వేశారు. ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన ఇళ్లు మినహాయించి సెంటు చొప్పున 1,163 ప్లాట్లు వేశారు. ఇంకా ఖాళీ స్థలం మిగిలిపోయింది. ఇదే అదునుగా భావించిన కొంతమంది నాయకులు లక్షల రూపాయలకు ప్లాట్లు అమ్ముకున్నారు. లబ్ధిదారులు సెంటు స్థలంలో ఇల్లు కట్టుకుంటుంటే ఆక్రమణదారులు 3 నుంచి 5 సెంట్లలో ఇల్లు నిర్మించారు. అవి కూడా రెండు, మూడు అంతస్తులు నిర్మించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర నిర్మాణాలు కూడా చేపట్టారు. అయినా వీటిని పట్టించుకునేవారే లేరు.

ఇష్టారాజ్యంగా ప్లాట్ల అమ్మకాలు

గతంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన తరువాత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి ముందుకురాలేదు. 200 మంది వరకు మాత్రమే ఇళ్లు నిర్మించారు. ఇళ్లు కట్టుకోని వారి స్థలాలు ఖాళీగా ఉండిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసింది. ఒక్కొక్కరికి సెంటు స్థలం కేటాయించింది. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ పట్టాలను రద్దు చేసింది. ఇదే కొంతమంది వైసీపీ నాయకులకు వరంగా మారింది. ఖాళీ స్థలం కనబడితే సొంతం చేసుకుని, అడ్డగోలుగా అమ్మేసినట్లు సమాచారం. అలా ప్లాట్లు కొనుగోలు చేసినవారు అందుబాటులో ఉన్నంత ఆక్రమించుకుని, నిర్మాణాలు చేపట్టారు. ప్లాట్లు కొన్నవారు కొంతమంది మూడంతస్తుల వరకు కట్టుకున్నారు. మరికొంతమంది విశాలంగా భవనాలు నిర్మించుకున్నారు.



లేఅవుట్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

అరసెంటు తగ్గించి..

ఎర్రగుట్టపల్లి వద్ద గతంలో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేశారు. పలువురు లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున పట్టాలిచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక దానినే జగనన్న కాలనీగా మార్పు చేశారు. గతంలో పంపిణీ చేస్తున్న సెంటున్నరలో కోతపెట్టారు. సెంటు చొప్పున లబ్ధిదారులకు అందించారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసినపుడు అక్కడక్కడా నిర్మాణాలు చేపట్టడం, మిగిలిన స్థలాల్లో జగనన్న కాలనీ వేయడంతో చాలా స్థలాలు మిగిలిపోయాయి. ఇదే అదునుగా పలువురు వైసీపీ నాయకులు రంగప్రవేశం చేశారు. ప్లాట్లు అమ్ముకున్నట్లు సమాచారం. అలా.. ఇక్కడ లబ్ధిదారులకన్నా, ఆక్రమణదారులే పెరిగినట్లు తెలుస్తోంది.

అనుమతుల్లేకుండానే..

ఇల్లు నిర్మించుకోవాలంటే మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరి. ఎర్రగుట్టపల్లి జగనన్న లేఅవుట్‌లో గతంలో ఒకటిన్నర సెంటులో ఇళ్లు నిర్మించుకున్నారు. వైసీపీ పాలనలో సెంటు మాత్రమే ఇచ్చారు. ఈ రెండింటిని కాదని కొంతమంది 5 సెంట్ల స్థలంలో అనుమతులు లేకుండా ఇళ్లు కట్టారు. మరికొందరు బేసిమెంట్లు వేశారు. ఇలా అడ్డగోలు నిర్మాణాలు ఎన్నో ఉన్నాయి. 1,163 స్థలాలు ప్రభుత్వం ఇస్తే మరో నాలుగువందల వరకు అనుమతిలేని నిర్మాణాలు చేపట్టారు. వీరికి మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేసినా, ఎటువంటి ఫలితం లేదు.

గుడి, బడి స్థలం ఎక్కడుందో..?

35 ఎకరాల్లో లేఅవుట్ వేయాలంటే నిబంధనల ప్రకారం మూడున్నర ఎకరా వరకు గుడి, బడి, ఇతర ప్రజా అవసరాలకోసం స్థలం వదలాలి. ఆ స్థలం కూడా ప్రస్తుతానికి ఆక్రమణలో ఉన్నట్లు సమాచారం. కొంతమంది ఆ స్థలంలో దర్జాగా బేసిమెంట్లు వేసుకున్నారు. గుడి, బడి స్థలాన్ని కూడా అడ్డగోలుగా ఆక్రమించడంతో భవిష్యత్తు అవసరాలకు స్థలం లేకుండాపోయింది. జగనన్న లేఅవుట్‌లో ఆక్రమణలపై విచారణ చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలపై చర్యలు చేపడతాం

ఎర్రగుట్టపల్లి జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, హౌసింగ్ అధికారుల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తాం. ఆక్రమణదారులను అడ్డుకుటాం. అనుమతిలేని నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులిచ్చాం. దీనిపై చర్యలు చేపడతాం.

- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

జిల్లాలో తేలికపాటి వర్షం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2: జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువులో అత్యధికంగా 10.4 మి.మీ, వర్షం కురిసిందన్నారు. తలుపుల 9.2, కనగానపల్లి 8.4, పుట్టపర్తి 7.8, చెన్నేకొత్తపల్లి 7.4, బుక్కపట్నం 7.2, నల్లమాడ 6.6, రామగిరి 4.6, ఓబుళదేవరచెరువు 4.2, కదిరి 2.4, గాండ్లపెంట 2.0, బత్తలపల్లిలో 1.2 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

మినీ బస్సు బోల్తా

18 మందికి గాయాలు

నల్లమాడ: మండలంలోని పులగంపల్లి సమీపాన మలుపులో సోమవారం రాత్రి మినీ బస్సు బోల్తా పడి, 18 మంది గాయపడ్డారు. కదిరి పట్టణం నుంచి మినీ వ్యాన్‌లో రోజూ గోరంట్ల సమీపంలోని ఓ గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనికి మహిళలు వెళ్తున్నారు. సోమవారం కూడా పనులకు వెళ్లి తిరిగి కదిరికి వస్తుండగా.. పుగలంపల్లి వద్ద మలుపులో మినీ బస్సు టైరు పంక్చరై బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న సోఫియా, గులాబ్‌జాన్, షాజీరా, గౌసియా, ఆయిషా, ఫక్రున్నీషా, మరో 12మంది గాయపడ్డారు. బాధితులను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.







బోల్తాపడిన మినీ బస్సు, గాయపడిన ఫక్రున్నీషా, ఆయిషా

ప్రజావేదికలో 243 ఫిర్యాదులు

పుట్టపర్తి, సెప్టెంబరు 2: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 243 వినతులు అందాయి. కలెక్టర్ చేతన్ వాటిని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

డీపీఓలో 63..

పుట్టపర్తి రూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 63 ఫిర్యాదులు అందాయి. వాటిని జిల్లా ఎస్పీ రత్న స్వీకరించారు. ఫిర్యాదుదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి, సెప్టెంబరు 2: ధర్మవరంలోని ప్రభుత్వ పాలటెక్నిక్, పెనుకొండలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆయా కళాశాలల్లో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఖయ్యూమ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రణాళికను సిద్ధం చేయండి

రానున్న ఏడాదికి 15 శాతం వృద్ధిని సాధించే దిశగా జిల్లా ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. వికసిత్ ఆంధ్ర-2047కు సంబంధించి జిల్లా ప్రణాళికను రూపొందించుకుని, లక్ష్యాల సాధన దిశగా పని చేయాలన్నారు.



హోటల్‌కు చేరుకున్న శ్రేయస్ అయ్యర్



రుతురాజ్ గైక్వాడ్



అర్షదీప్ సింగ్



అక్షర్ పటేల్



హోటల్‌లో క్రికెటర్లు



ఆర్డీటీ మైదానంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

వచ్చేశారు

- అనంతకు చేరిన క్రికెటర్లు
- 5 నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత క్రికెటర్లు సోమవారం నగరానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 10గంటల వరకు ఆటగాళ్లు బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన నగరానికి చేరుకున్నారు. హోటల్ సిబ్బంది, ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘాల సభ్యులు క్రికెట్ ఆటగాళ్లకు నుదిటిన కుంకుమ పెట్టి, కొబ్బరికాయ, బొకేలు అందజేసి స్వాగతం పలికారు. నగరానికి చేరిన వారిలో ఇండియా-సీ జట్టులో భారత కీలక ఆటగాళ్లు రుత్‌రాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరెల్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైషాక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షుచౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్ ఉన్నారు. ఇండియా-డీ జట్టులో.. శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ తైడే, యష్‌దుబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రికీభుయ్, సరాన్ష్‌జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్ నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌కు చేరారు. హోటల్‌లో బస చేసిన ఆటగాళ్లు మంగళవారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్‌కు హాజరుకానున్నారు. ప్రాక్టీస్ సెషన్‌కు ఎవరికీ అనుమతి లేదని, ఐదు నుంచి అభిమానులను మ్యాచ్‌కు అనుమతిస్తామని దులీప్‌ట్రోఫీ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్ తెలిపారు.

పోలీసు వలయంలో ఏసీజీ

అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌పోలీసుల భద్రతా వలయంలోకి చేరింది. ఈనెల 5 నుంచి 22వతేదీ వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో, ఆటగాళ్లు బసచేసే మాసినేని, అలెగ్జాండర్ హోటళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల బృందం సోమవారం ఏసీజీలో, బసచేసే హోటళ్లు మాసినేని గ్రాండ్, అలెగ్జాండర్ వద్ద భద్రతను పరిశీలించారు. హోటల్‌లో ఆటగాళ్ల పట్ల తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. భారత ఆటగాళ్లు ఏసీజీకి వెళ్లే రూట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఎస్పీలో డ్రెస్సింగ్ రూంలు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలకు చర్యలు తీసుకోనున్నారు. సుమారు 350మందికి పైగా పోలీసులతో దులీప్‌ట్రోఫీకి బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

తెగుళ్ల

- పంటలపై తెగుళ్ల దాడి
- పైర్లను పీల్చేస్తున్న పురుగులు
- మందులు వాడినా తగ్గని ఉధృతి
- వాతావరణ మార్పులే కారణం





పంటను ఆశించిన పచ్చపురుగు



పత్తిపంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్నరైతు

గుత్తి రూరల్, సెప్టెంబరు 2: వాతావరణ మార్పులతో పంటలపై తెగుళ్ల దాడి తీవ్రమైంది. వేరుశనగ, పత్తి, ఆముదం పైర్లను తెగుళ్లు పీల్చి పిప్పి చేస్తున్నాయి. పైరును ఆకుముడత తెగులుతో పాటు పచ్చపురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా వర్షాలు కురవడంతో మృగశిర, పునర్వసు కార్తెలలో నే రైతులు వేరుశనగ, పత్తి, ఆముదం పంటలు సాగు చేశారు. మండల వ్యాప్తంగా వేరుశనగ ఐదు వేల హెక్టార్లు, పత్తి 1900 హెక్టార్లు, ఆముదం 920 హెక్టార్లలో సాగు చేశారు. జూన్ మొదటి వారం నుంచి నెలాఖరి వరకు ఈ పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంటకు తెల్లదోమ, పచ్చదోమ, పురుగు ఆశించింది. వాటి కోసం ఇప్పటి వరకు నాలుగు సార్లు మందులు పిచికారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఆముదం పంటకు నామాల పురుగు ఆశించింది. వాటి కోసం రైతులు మందులు కొట్టారు. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్త పేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, ఊబిచేర్ల, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి వాతావరణ మార్పులతో పంటకు తెగుళ్లు సోగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు వాడినా చీడల పీడపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా రైతులు తనను నేరుగా లేదా ఫోన్ సంప్రదించినా తెగుళ్ల నివారణకు తగిన సలహాలు, సూచనలు ఇస్తానని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు.

నాలుగుసార్లు మందులు కొట్టా..



నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పైరుకు ఆకుముడత, పచ్చపురుగు ఆశించింది. వాటికి పురుగు మందు పిచికారీ చేశాను. ఇప్పటి వరకు నాలుగు సార్లు మందులు కొట్టా. అయినా మళ్లీ పురుగులు పంటను ఆశిస్తున్నాయి. మరోసారి మందు కొట్టాల్సిందే.

\- కృష్ణ రైతు, గొందిపల్లి

తగ్గని పురుగుల ఉధృతి



నేను రెండు ఎకరాల్లో జూన్‌లో పత్తి పంట సాగు చేశా. ఒక సారి సత్తువ మందు పోశా. నాలుగు సార్లు పురుగు మందు పిచికారీ చేశా. వాతావరణ మార్పుల వలన పంటకు తెగుళ్ల ఉధృతి పెరుగుతోంది. వాతావరణం అనుకూలిస్తేనే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

\- రంగప్ప రైతు బేతాపల్లి

ఎండుకుళ్లుతో టమోటా రైతు కుదేలు

యాడికి: ఆకులు ఎండు కుళ్ల తెగులుతో పంట దెబ్బతింటుండటంతో టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 80నుంచి 100ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. అసలే ధరలు లేక ఇబ్బంది పడుతుంటే ఉన్న పంటను ఎండుకుళ్ల తెగులు నాశనం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట ఒకటి, రెండు మొక్కలకు సోకి ఆకులన్నీ ఎండిపోతున్నాయని, పట్టించుకోకపోతే పొలమంతా వ్యాపించి పంటను తొలగించే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు తెలిపారు. ఎన్నిరకాల మందులు వాడినా ఆశించిన మేర ప్రయోజనం ఉండటం లేదని పేర్కొంటున్నారు. ఈ తెగులు ప్రభావంతో దిగుబడి అంతంత మాత్రంగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగులు ప్రభావం ఎలా ఉంటుందంటే..

రైతులు తెలిపిన మేరకు టమోటా ఆకుల్లో ఎండుకుళ్ల తెగులు ఎలా సోకుతుందంటే వర్షం పడిన రెండు నుంచి మూడు రోజుల తర్వాత టమోటా మొక్క సుడుల వద్ద ఎండిపోవడం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి మొక్క వేర్ల దాకా తెగులు సోకుతుంది. మొక్క పూర్తిగా ఎండిపోతుంది. తెగులు ప్రారంభంలో ఒకట్రెండు మొక్కలే కదా అని నిర్లక్ష్యం చేస్తే పొలం అంతా వ్యాపిస్తుంది.



తెగులుతో ఆకులు ఎండిపోతున్న మొక్క

పంట ఎండిపోతోంది..



నేను రెండు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. ఉన్నట్లుండి ఆకుల్లో ఎండుకుళ్ల తెగులు కనిపిస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగులు అదుపులోకి రావడం లేదు. దీంతో పంటను కోల్పోవాల్సి వస్తోంది. ధర లేక ఇబ్బంది పడుతుంటే తెగులుతో మరింత నష్టపోవాల్సి వస్తోంది.

\- రజనీ, టమోటా రైతు, రాయలచెరువు

తెగులు ప్రభావం ఎక్కువగా ఉంది..



నేను మూడున్నర ఎకరాల్లో టమోటా సాగుచేశా. వర్షం పడిన రెండు రోజుల తర్వాత టమోటా పంటకు ఎండుకుళ్ల తెగులు సోకుతోంది. మందులు పిచికారి చే సినప్పటికి తెగులు అదుపులోకి రావడం లేదు. తెగుళ్ల బారినుంచి పంటను కాపాడుకోవడానికి పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి వస్తోంది.

\- విశ్వనాథ్, టమోటా రైతు, రాయలచెరువు

సస్యరక్షణ చర్యలు చేపట్టండి: శాస్త్రవేత్తలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: వర్షాల కారణంగా జిల్లాలోని పలు రకాల పంటలకు తెగుళ్లు సోకాయని, వాటి నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు, శాస్త్రవేత్త శిరీష సూచించారు. వేరుశనగ పంటలో వేరుపురుగు, ఆకు మచ్చ, వేరుకుళ్లు తెగుళ్ల నివారణ కోసం 2 మి.లీ. క్లోరోపైరిపాస్, 4 గ్రాములు సాఫ్‌ను ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో మొక్క పురుగు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 400 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆముదం పంటలో నామాల పురుగు, ఆకు మచ్చ నివారణ, మొక్కజొన్నలో కత్తెర పురుగు, ఆకుమాడు తెగులు నివారణ కోసం 80 మి.లీ. ఇమామిక్టిన్ బెంజోయేట్, 400 గ్రాములు సాఫ్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. టమోటాలో గజ్జి తెగులు, కాల్షియం లోపం నివారణ కోసం 400 గ్రాములు సాఫ్, 50 గ్రాములు బొరాక్స్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మిరప, వంగ, ఇతర కూరగాయల పంటల్లో ఆకు మచ్చ తెగులు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 400 గ్రాములు సాఫ్, 200 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అరటి, చిన్న నిమ్మ తోటల్లో సూక్ష్మధాతులోపాలు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం 500 గ్రాములు పొటాషియం నైట్రేట్, 200 మి.లీ. స్పైనిటిరామ్‌ను ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వివిధ పంటల్లో అధిక తేమ మూలంగా సూక్ష్మధాతులోపాల నివారణ కోసం అర కేజీ అన్నబేది, అర కేజీ మాక్స్, అర కేజీ మల్టీకేని ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు.

వైసీపీ మూకల వీరంగం

వేటకొడవళ్లతో టీడీపీ వర్గీయులపై దాడులు

కుణుతూరు, కొండాపురంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన లక్ష్మీదేవి



గాయపడిన ప్రకాష్‌గౌడ్

ధర్మవరంరూరల్/బుక్కపట్నం, సెప్టెంబరు2: వైసీపీ మూకలు గూండాగిరీ ప్రదర్శించారు. వేటకొడవళ్లతో వీరంగమే చేశారు. టీడీపీ వర్గీయులపై సోమవారం విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ధర్మవరం మండలంలోని కుణుతూరు గ్రామంలో టీడీపీ వర్గీయుడు కొసిన ప్రకాష్‌గౌడ్ ఇంటి సమీపంలోనే వైసీపీకి చెందిన నరేంద్ర నివాసం ఉంటున్నాడు. తన ఇంటికి విద్యుత్ సరఫరా కావట్లేదని నరేంద్ర తరచూ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు తొలగిస్తున్నాడు. సోమవారం రాత్రి కూడా ఫ్యూజులు తొలగించడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రకాష్‌గౌడ్.. మరమ్మతులు ఉదయాన్నే చూసుకోవాలనీ, రాత్రిళ్లు విద్యుత్ సరఫరా ఆపేస్తే ఎలా అని ప్రశ్నించాడు. దీంతో కోప్రోద్రిక్తుడైన నరేంద్ర, అతడి తల్లి ఈశ్వరమ్మ, తమ్ముడు ఆనంద్, చిన్నాన్న నారప్ప కలిసి ప్రకాష్‌గౌడ్‌తో గొడవకు దిగారు. అతడి తలపై కొడవలితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌గౌడ్‌ను కుటుంబసభ్యులు బైక్‌లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు ప్రకాష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

కొండాపురంలో మహిళపై..

బుక్కపట్నం మండలంలోని కొండాపురం గ్రామంలో వైసీపీ నాయకుడు, స్టోర్ డీలర్ నల్లపరెడ్డి సోమవారం వీరంగం సృష్టించాడు. కుమారుడు వేణుగోపాల్ రెడ్డితో కలిసి వేట కొడవళ్లతో గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఇంటిపై దాడి చేశాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత వైసీపీ హయాం నుంచి గ్రామంలో నల్లపరెడ్డి స్టోర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం విజిలెన్స్ అధికారులు రేషన్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఇందుకు భాస్కర్‌రెడ్డి కారణమన్న ఆక్రోశంతో నల్లపరెడ్డి అతడి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి వేటకొడవళ్లతో వీరంగం చేశారు. భాస్కర్‌రెడ్డి ఇంటిపైకి వెళ్లారు. ఆ సమయంలో భాస్కర్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన భార్య లక్ష్మీదేవిపై దాడిచేశారు. విచక్షణారహితంగా కొట్టారు. 'నీభర్త భాస్కర్‌రెడ్డి, కుమారుడు నాగిరెడ్డిని చంపేస్తామం'టూ బెదిరించి, నానా దుర్భాషలాడి వెళ్లిపోయారు. గాయపడిన లక్ష్మీదేవిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: గంజాయి తెచ్చి విక్రయిస్తున్న నగరంలోని నీరుగంటి వీధికి చెందిన వాయకర్ గణపతిరావు వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిందితుడు గంజాయి వ్యాపారంలోకి దిగాడని పోలీసులు తెలిపారు. గంజాయికి అలవాటుపడిన వారి నుంచి విశాఖపట్నం జిల్లా పాడేరుకు చెందిన గంజాయి వ్యాపారులు చిట్టి, పొట్టి ఫోన్ నంబర్లు తీసుకున్నాడని, ఆరు నెలల నుంచి వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు. అనకాపల్లికి రైలులో, అక్కడి నుంచి పాడేరుకు బస్సులో వెళ్లి కిలో గంజాయి రూ.7 వేలకు కొని అనంతపురం నగరానికి తీసుకువచ్చి కిలో రూ.15 వేలకు అమ్ముతున్నాడని తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గుత్తి రోడ్డులోని మిర్చియార్డ్ సర్కిల్‌లో నిందితుడని అరెస్టు చేశారు. అతని నుంచి 3.5 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రూడ్‌సెట్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 9 నుంచి ప్రారంభించి 30రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 8309915577, 9618876060లను సంప్రదించాలని కోరారు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు బంద్ నోటీసు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2: ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు అనంతపురం ఐఎంఎల్ డిపో మేనేజర్ శివశంకర్‌రెడ్డికి సోమవారం బంద్ నోటీసులు అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఈనెల 7వ తేదీ బంద్ చేయిస్తామని అందులో పేర్కొన్నారు. డిపో మేనేజర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర‌రెడ్డి, నాయకులు మహేంద్ర, భరత్, రమేష్, హరీష్, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, నాగేంద్ర, రాజశేఖర్, నరసింహరాజు కలిశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని మద్యం దుకాణాలను 7వ తేదీన బంద్ చేయాలని నిర్ణయించామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

జీడిపల్లికి 913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 2: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం 913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 534 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో అవుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే మరువ ద్వారా పీఏబీఆర్‌కు 339 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు వెల్లడించారు.

సూపర్ మచ్చా

- దత్తారెడ్డి సెంచరీ.. జిల్లా జట్టు భారీ స్కోరు



మచ్చా దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2: జిల్లా క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి సూపర్ సెంచరీతో జిల్లా జట్టు భారీ స్కోరు చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో జరుగుతున్న అండర్-23 ఆంధ్రాసౌత్ జోనల్ స్థాయి టోర్నీలో జిల్లా జట్టు కెప్టెన్ మచ్చా దత్తారెడ్డి కడప జట్టుపై అద్భుత సెంచరీ సాధించాడు. 155 బంతుల్లో 11 సిక్సులు, 13 ఫోర్లతో 181 పరుగులు సాధించాడు. దీంతో జిల్లా జట్టు 553 పరుగుల భారీ స్కోర్ చేసింది. కడప బౌలర్లు అస్లాం 5వికెట్లు, ఆదిల్‌హుస్సేన్ 4, విజయ్ ఒక వికెట్ పడగొట్టారు. ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు దత్తారెడ్డిని అభినందించారు.

రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోండి: ఏడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 2: ఉమ్మడి జిల్లాలోని 614 మసీదులలో ప్రభుత్వ గౌరవ వేతనం పొందుతున్న ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీ ప్రెసిడెంట్‌లు యుటిలైజేషన్ సర్టిఫికెట్, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించే 36, 40, 41 సెక్షన్ల కింద రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ రామసుబ్బారెడ్డి సూచించారు. ఫారం-1 అప్లికేషన్, మసీదు ఒరిజినల్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్ లేదా తహసీల్దారు నుంచి పొజిషన్ సర్టిఫికెట్, బ్లూ ప్రింట్, ముతవల్లి, ఇమాం, మౌజాన్, ఇద్దరు సాక్షుల ఆధార్ కార్డులు, మసీదుల ఫొటోలు, ఫోన్ నంబర్లతో ఒకటి ఒరిజినల్ సెట్, మూడు జిరాక్స్ కాపీలు కలెక్టరేట్ ఆవరణంలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అనంతరం గుర్తింపు రశీదులను తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సమర్పించకపోతే గౌరవ వేతనాలు నిలిపివేసే ప్రమాదం ఉందని అన్నారు. తక్షణమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9966647586, 9573073786, 9032557006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

16 బైకులు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 2: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో పలుచోట్ల 16 ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సోమవారం వెల్లడించారు. కుందుర్పి మండలం బోదపల్లికి చెందిన పాతన్న అనంతపురం, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కర్ణాటకలోని బళ్లారి, పావగడ పోలీస్‌స్టేషన్‌లలో 23 పాత కేసులలో నిందితుడని తెలిపారు. పట్టణంలోని ఉమానగర్‌లో ఓ ద్విచక్ర వాహనం చోరీ కావడంతో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి పాత నేరస్తులను విచారించగా సూత్రధారిగా పాతన్న పేరు బయటపడిందన్నారు. దీంతో అతడిని అరెస్టు చేసి 16 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ హరినాథ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

23 మందికి గాయాలు.. ఎక్కువ మంది కూలీలే..

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని మూడు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. 23 మంది గాయపడ్డారు. బాధితులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులలో ఒకరు, గాయపడ్డవారిలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు.

బైకు అదుపుతప్పి..

గార్లదిన్నె: రామదాసుపేట-కనుంపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ (26) అనే యువకుడు మృతిచెందాడు. నార్పల సుల్తాన్‌పేటకు చెందిన ఆదినారాయణ, దానమ్మ దంపతుల కుమారుడు రాజశేఖర్ సోమవారం సాయంత్రం గుత్తి వైపు నుంచి నార్పలకు వస్తుండగా కనుంపల్లి సమపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో.. బొలెరో ఢీకొని..

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం కుర్లపల్లి, మేలుకుంట క్రాస్‌లో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను బొలెరో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కూలీ అన్నపూర్ణమ్మ (50) మృతి చెందారు. మరో 14 మంది కూలీలు గాయపడ్డారు. కర్ణాటకలోని రొప్పం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు టమోటా పంటను కోసేందుకు కంబదూరు మండలం కుర్లపల్లికి వస్తుండగా.. బొలెరో ఢీకొట్టింది. ఈ వేగానికి ఆటో మూడు పల్టీలు కొట్టడంతో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా అన్నపూర్ణమ్మ మృతిచెందారు. బాధితులకు కళ్యాణదుర్గం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆటోడ్రైవర్ రాముకు రెండుకాళ్లు విరిగిపోయాయి. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రాజశేఖర్ (ఫైల్)

బైకు.. ఆటో ఢీ..

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో, జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా పడటంతో 9 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుగురు మహిళా కూలీలు ఉన్నారు. న్యామద్దల గ్రామానికి చెందిన కూలీలు చెన్నేకొత్తపల్లిలో వ్యవసాయ పనులను ముగించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటోను పెనుకొండ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు పక్కన బోల్తాపడింది. కూలీలు వెంకటనరసమ్మ, నాగలక్ష్మీ, తలారినరసమ్మ, అరుణ, నరసమ్మ, రామాంజినమ్మ, లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ చంద్రమౌళి, ద్విచక్రవాహనదారుడు సంతోష్ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రెండు 108 వాహనాల్లో అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కంబదూరు మండలంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కూలీలు

కమిషనర్ మల్లికార్జున నియామకాన్ని రద్దు చేయాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 2 : ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున నియామకాన్ని రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటిసనత్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో కమిషనర్ మలికార్జున టీడీపీ నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఒకానొక సమయంలో వైసీపీ కండువాలు వేసుకుంటేనే ఇంటికి అప్రూవల్ ఇస్తామని, లేదంటే ఇంటిని కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారన్నారు. రిజర్వు స్థలాలు, రోడ్డు పక్కన ఉండే చాలా విలువైన భూములే కాకుండా తుంపర్తి దగ్గర టీడీపీ హయాంలో ఇచ్చిన ఆరు వేల పట్టాలను తొలగించి వైసీపీ నాయకులకు కట్టపెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాంపురం శీన, గంగారపు రవి, అడ్డా మహేశ్, యుగంధర్, లోకేశ్, కుళ్లాయప్ప, సంగాల బాలు, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు రక్తపరీక్షలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోగులను పరిశీలిస్తున్న డీపీఎంఓ కుళ్లాయప్పనాయక్

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 2: గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో జ్వరం బారిన జనం- గ్రామీణులు విలవిల అనే వార్తను సోమవారం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారి కె. చిన్నకుళ్లాయప్పనాయక్ మండలంలోని కుసుమవారిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో పర్యటించారు. జ్వరాల బారిన పడిన వారిని స్వయంగా పలకరించి, వైద్యసేవలందించారు. అనంతరం గ్రామస్థులకు ఆయన పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరానికి హాజరైన 64 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం మండలంలోని వడ్డివారిపల్లి వద్ద కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్‌నాయక్, డాక్టర్ కమల్‌రోహిత్, జిల్లా కేంద్రం ఉప మలేరియా అధికారి లక్ష్మీనాయక్, వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవలానాయక్, శశిధర్, సిహెచ్‌ఓ సుభాషిని, హెల్త్ సూపర్‌వైజర్లు విజయకుమారి, మురళి, ఆరోగ్య సిబ్బంది షహనూర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కదిరి అర్బన్, సెప్టెంబరు 2 : మండలంలోని సున్నపుగుట్టతండాలో నాగరాజు (38) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. గాండ్లపెంట మండలంలోని మల్లమీదపల్లికి చెందిన ఇతను కదిరి మండలంలోని సున్నపుగుట్టతండాలో స్థిరపడ్డారు. సున్నపుగుట్టతండాలో ఇంటినిర్మాణం చేపడుతున్నారు. సాయంత్రం ఇంటిపైకి ఇనుప కడ్డీలు తీసుకెళ్తుతుండగా, విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. నాగరాజు వ్యవసాయ కూలిపనులు చేసుకుని జీవన సాగించేవాడు. అతనికి భార్య లక్ష్మీ, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుండెపోటుతో చేనేత కార్మికురాలు..



రజియాబీ (ఫైల్)

ధర్మవరం : స్థానిక శివానగర్‌కు చెందిన ఓ చేనేత కార్మికురాలు రిజియాబీ సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించింది. ఆమె అద్దె ఇంటిలో ఉం టూ కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. అయితే ఆమెకు సోమ వారం ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలింది. గమనించిన భర్త నబీరసూల్ ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మరణిం చినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కొత్తచెరువు మాజీ ఎంపీపీ...



పీవీ చౌదరి (ఫైల్)

కొత్తచెరువు : కొత్తచెరువు మండల మాజీ ఎంపీపీ పీవీ చౌదరి (84) సోమవారం మరణించారు. సోమవారం అనంతపురంలో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం నిద్రించారని, నిద్రలోనే ఆయన మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, పలువురు రాజకీయ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని స్వగ్రామమైన కొత్తచెరువుకు తరలించారు. పీవీ చౌదరికి కుమార్తె శ్రీదేవి, కుమారులు పీవీ.వెంకటేశ్వర ప్రసాద్, సిరి ఆస్పత్రి అధినేత డాక్టర్ రాంప్రసాద్ ఉన్నారు. కాగా, పీవీ చౌదరి 10 సంవత్సరాలు ఎంపీపీగా సేవలందించారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త ...

ముదిగుబ్బ : స్థానిక సాయినగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మహబూబ్ బాషా (33) అనారోగ్యంతో మరణించాడు. అతను స్థానికంగా ఉన్న ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతను సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, చికెన్ తిరుపాలు, చంద్రసేన అతని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళకు పాముకాటు

నంబులపూలకుంట : మండల కేంద్రానికి చెందిన రమణమ్మకు సోమవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. దిగువపల్లి పొలాల్లో వేరుశనగ మొక్కలు తొలగిస్తుండగా, పాము కాటు వేసింది. వెంటనే ఆమెను తోటి కూలీలు మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలకు ద్విచక్రవాహనంలో తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను 108 వాహనంలో అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పంటల పరిశీలన

నల్లమాడ, సెప్టెంబరు 2 : మండలంలోని గేపేపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని మొక్కజొన్న, వరి, వేరుశనగ పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, అనిత సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట దిగుబడులు, చీడపీడలను పరిశీలించారు. వేరుశనగలో ఇనుపధాతు లోపం గమనించి, నివారణ కోసం అన్నబేదీ 5గ్రాములను లీటర్‌నీటిలో, నిమ్మ ఉప్పు ఒక గ్రాము కలిసి పిచికారి చేయాలన్నారు. నీరు ఎక్కువగా పొలంలో నిలువడంతో ఆకులు తెల్లగా ఆవుతాయన్నారు. వేరుశనగ పంటపై ఆకుమచ్చ తెగులు నివారణ కోసం టెబికోనాజోల్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కంది పంట పూత దశలో ఉందని, వేపనూనె ఐదు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. వరినాట్లు వేసినప్పుడు రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలి బాటలు తీసుకోవాలన్నారు. దీనివలన గాలి, వెలుతురు తగిలి వ్యాధులు తగ్గుతాయన్నారు. మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు నివారణ కోసం ఇమామేక్టిన్ జెంబోఏట్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి సుడిఓ పడేలా పిచికారి చేయాలన్నారు. వారి వెంట శాస్త్రవేత్త సనావుల్లా, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు, ఏఓ సుమతి, సిబ్బంది నిర్మలా కుమారి, రైతు సేవా సహాయకులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ సమావేశం

నల్లచెరువు, సెప్టెంబరు 2 : ఉపాధి పథకంలో 2023-24కు గాను సామాజిక తనిఖీలు వారం రోజుల నుంచి నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మంజుల తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రాథమిక ఆసుపత్రి ఆవరణంలో బహిరంగ సమావేశాన్ని నిర్వహిస్తామని, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు హాజరుకావాలని కోరారు



కదిరిలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



ధర్మవరం పాఠశాలలో కేక్‌ను తినిపిస్తున్న చిలకం



పుట్టపర్తిలో కేక్ కట్ చేస్తున్న పల్లెరఘునాథరెడ్డి



నల్లమాడలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఘనంగా పవన్ జన్మదినం

కదిరి అర్బన్, సెప్టెంబరు 2: జనసేనా అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం కదిరిలో ఘనంగా నిర్వహించారు. ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఇందులో 50 మంది రక్తదానం చేశారు. అలాగే ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణంలో మొక్కలు నాటారు. జీవిమాన్ సర్కిల్‌లో అన్నదానం నిర్వహించారు. అలాగే విద్యుత్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

- పుట్టపర్తి : పవన్ కల్యాణ్ జన్మదినాన్ని కూటమి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తిలో గణేష్ సర్కిల్లో పవన్ కల్యాన్ అభిమానులు నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి కేక్‌కట్ చేశారు.
- ధర్మవరం : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పోతుకుంట శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో కేక్‌కట్ చేసిన అనంతరం మొక్కలు నాటారు. పలు పాఠశాలల్లో కేక్‌లను కూడా కట్ చేసి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. తాడిమర్రిలో పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీచేశారు. నారసింపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ధర్మవరం పట్టణంలోని వరలక్ష్మీ థియేటర్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.
- కొత్తచెరువు : నాలుగు రోడ్ల కూడలి, రాయల్ సర్కిల్ కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పాల్గొన్నారు.
- బుక్కపట్నం : స్థానిక తేరు కూడలిలో జనసేన నాయకులు భారీ కేక్ కట్ చేశారు. జనసేన యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- అమడగూరు : బస్టాండ్ ప్రాంతంలో కేక్ కట్ చేశారు. యువత ప్రభుత్వ ఆసుపత్రి, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వీట్లు పంచారు.
- ముదిగుబ్బ : బలిజ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణంలో, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు.
- నల్లమాడ : బస్టాండ్ ప్రాంతంలో కేక్‌కట్ చేశారు. అందరికీ స్వీట్లు పంచారు.
- తనకల్లు : మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పూల మొక్కలు నాటారు. తనకల్లులో పవన్ చిత్రపటాన్ని ఊరేగించారు.



బుక్కపట్నంలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు



అమడగూరులో కేకును కట్ చేసిన దృశ్యం





కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలి, రాయల్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు



తనకల్లు గిరిజన గురుకుల పాఠశాలలో మొక్కలు పంపిణీ



ముదిగుబ్బలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

రోగుల వద్దకే పింఛన్

గాండ్లపెంట, సెప్టెంబరు 2 : మండలంలోని కురమామిడి సచివాలయ సిబ్బంది బెంగుళూ రులో వైద్యం చేయించుకుంటున్న రోగి వద్దకు వెళ్లి సోమవారం పింఛన్ అందజేసింది. కురమామిడి గ్రామానికి చెందిన మద్దె రమణమ్మ బెంగుళూరులోని సప్తగిరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించు కుంటోంది. ఆమెకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.10వేలు అందించాల్సి ఉంది. దీంతో ఆ గ్రామ సచివాలయానికి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాబాఫకృద్దీన్ బెంగళూరులోని ఆ రోగి వద్దకెళ్లి పింఛన్ అందించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

కదిరి అర్బన్ : మండలంలోని చలమకుం ట్లపల్లికి చెందిన ఇమామ్‌బీ అనారోగ్యంతో మదనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. సచివాలయ మహిళ పోలీస్ శోభారా ణి సోమవారం మదనపల్లి ఆసుపత్రికెళ్లి ఇమామ్‌బీకి పింఛన్ అందించారు.





బెంగుళూరులో బాబా ఫకృద్దీన్, మదనపల్లెలో శోభారాణి పింఛన్ అంద చేస్తున్న దృశ్యం

తాగునీటి కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి: పల్లె

కొత్తచెరువు, సెప్టెంబరు 2 : శ్రీసత్యసాయిబాబా తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యను పరిష్కరిం చడానికి కృషి చేస్తానని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సత్యసాయి పంప్‌హౌస్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, తాగునీటి శాఖ సీఈతో ఫోన్‌లో మాట్లా డారు. సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల వేతనాలను జాప్యంపై ఆరా తీశారు. ఈ ఫైలు ప్రభుత్వ అధికారుల వద్ద ఉందని త్వరలోనే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యను పరిష్కరం అయ్యేవిధంగా చూస్తామని వారు హామీ ఇచ్చారన్నారు. వీరి సమస్యను త్వరలోనే పరిష్కారమవుతుందని పల్లె కార్మికులకు తెలిపారు.

బత్తలపల్లి : సత్యసాయి నీటి సరఫరా కార్మికులు స్థానిక పంపుహౌస్ వద్ద నిరసన చేపట్టారు. ఇందులో కార్మికులు జగన్, మారుతి, మహబూబ్, బాషా, కేశవ, రామ్మోహన్, సిద్దయ్య, అనంతయ్య, జయరాం, నరసింహులు, మురగేశ్ పాల్గొన్నారు.

వైసీపీ మీడియా దుష్ప్రచారాన్ని నమ్మొద్దు : పల్లె

పుట్టపర్తి : వైసీపీకి కొమ్ముకాసే మీడియా దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరాదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికార దర్పణం కోసం తాను ఏనాడూ ప్రాకులాడలేదన్నారు. అయినా తాను అధికార కార్యక్రమాల్లో హల్‌చల్ చేస్తున్నానని వైసీపీ మీడియా ప్రచారంపై పల్లె మండిపడ్డారు. ప్రజల కోసమే పార్టీ నాయకుడిగా సేవలందిస్తున్నానే తప్ప అధికార దర్పణం కోసం కాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే బంధువులు, పీఏలు రాజకీయ దర్పాణాన్ని ప్రదర్శించారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందని, జగన్ మీడియా ఇప్పటికైనా ఇలాంటి బురదచల్లే కార్యక్రమాలు మానుకోవాలని హితవుపలికారు.

భారీవృక్షం కూల్చివేత



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2 : జిల్లాకేంద్రానికి నడిబొడ్డులో ఉన్న భారీ వృక్షాన్ని ఎలాంటి అనుమతులూ లేకుండానే సోమవారం కూల్చివేశారు. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్టును కూల్చిన ఆ స్వార్థపరులపై కేసులు నమోదుచేయాలని కోరుతున్నారు.

భజన బృందం సభ్యులకు సన్మానం

నల్లచెరువు : పాలపాటి దిన్నె అంజనేయస్వామి ఆలయంలో వద్ద శ్రావణ శనివారాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించిన సభ్యులను, భక్తులకు సేవలందించిన వారిని ఈఓ రవీంద్రరాజు సోమవారం సన్మానించారు. ఒక్కొక్కరికి శాలువ, ఆలయ ప్రసాదం అందచేశారు.



భజన బృందం సభ్యులతో ఈఓ

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ధర్మవరం రూరల్ : వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని షిర్డిసాయి కళ్యాణ మండపంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో సులభతరం చేయడానికి ప్రత్యేక పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే నిర్వహకులు ఆన్‌లైన్‌లో రూపొందించిన వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజ, అగ్నిమాపక అధికారి రాజు, వినాయకచవితి ఉత్సవ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2 : ఉద్యోగస్థులందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర, జిల్లాగౌరవాధ్యక్షుడు మాధవ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, రాజశేఖర్, కొత్తచెరువు అధ్యక్షకార్యదర్శులు జయరాం, సాయిశివ, బుక్కపట్నం అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, వెంకటనాయుడు సీనియర్ నాయకులు చంద్ర, సేవేనాయక్, చంద్రమోహన్, వెంకటేష్, రమేష్, శివ, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థులు, భక్తులు

ఘనంగా సెంట్రల్ ట్రస్ట్ డే

పుట్టపర్తి, సెప్టెంబరు 2 : శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు 52 వార్షికోత్సవాన్ని ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేద పఠనంతో ఈ వేడుకలను ప్రారంభించారు. సత్యసాయి ప్రేమ తత్వంపై సంగీత గాన కచేరి చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా అందుతున్న సేవలపై భక్తి గీతాల ఆలాపన చేశారు. సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు.

పాలపాటి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

నల్లచెరువు : పాలపాటి దిన్నె అంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూర్తికావడంతో సోమ వారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఈఓ రవీంద్రరాజు, ఆలయా సిబ్బంది, భజన బృందం సభ్యులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ద్వారా 6,51,226 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మట్టి అక్రమ రవాణాను అడ్డుకోండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 2: మండలంలోని ఇనగలూరు పంచాయతీలో సర్వేనెంబర్ 267- 1, 2లోను, గుట్టమీద వదరరాజులస్వామి వద్ద పచ్చని చెట్లను తొలగించి.. యంత్రాలతో మట్టిని తరలిస్తున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. మట్టి అక్రమ తరలింపును అడుకునేలా చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్ రంగనాయకులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతి, నాయకులు రవికుమార్, సుధాకర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

ముదిగుబ్బ : స్థానిక బీసీ హాస్టల్‌ను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకా నిద్రలోనే అధికారులు



ఎంపీపీ కార్యాలయంలో ఉన్న మాజీ సీఎంల ఫొటోలు

బుక్కపట్నం, సెప్టెంబరు 2 : ప్రభుత్వం మారి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయ అధికారులు ఇంకా నిద్రమత్తులోనే ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలు పెట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఇప్పటికి మాజీ సీఎంలు జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోలే ఉన్నాయి.

వైసీపీ నాయకుల సరుకుల పంపిణీని అడ్డుకుంటాం



మాట్లాడుతున్న భీమనేని ప్రసాద్‌నాయుడు

ధర్మవరం, సెప్టెంబరు 2 : చౌకధాన్యపు డిపోల్లో సెప్టెంబరుకు సంబంధించిన నిత్యావసర సరుకులను వైసీపీ నాయకులు పంపిణీ చేస్తే అడ్డుకుంటామని టీడీపీ 25వ వార్డు ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్ నాయుడు, నాయకులు చీమల రామాంజి, రాయపాటి శివ, రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయిందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో చౌకధాన్యపు డిపోలు, మధ్యాహ్న భోజనం, ఆర్పీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు కేటాయించారన్నారు. అయితే ధర్మవరం నియోజకవర్గంలో మాత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఇంత వరకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వైసీపీ నాయకులే నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారన్నారు. దీంతో వైసీపీ వారి చౌకధాన్యపు డిపోలకు తాళాలు వేశామన్నారు. ఈ నెల అధికారుల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తే ఎలాంటి అభ్యంతరమూ లేదని, అలా కాదని వైసీపీ నాయకులు పంపిణీ చేస్తే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా గంగోజమ్మ



గాండ్లపెంట, సెప్టెంబరు 2: మండల ఇన్‌చార్జి ఎంపీపీగా గంగోజమ్మకు సోమవారం బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ రామానాయక్ పేర్కొన్నారు. గత నెల 8న ఎంపీపీ పదవికి తాతం జగన్మోహన్ రాజీనామా చేశారన్నారు. జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఆదేశాల మేరకు వైఎస్ ఎంపీపీ గంగోజమ్మకు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

మా స్థలాన్ని ఆక్రమించారు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2 : గోరంట్లలో తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలని గోరంట్లకు ముగ్గురు ఉపాధ్యాయులు ఎస్పీ రత్నాకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులు మురళి, రంగారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వేనెంబరు 292-2లో 17 సెంట్లు 2011లో చలపతి వద్ద కొనుగోలు చేశామని, 2022లో చలపతి ఆ స్థలంలో రోడ్డు వేశాడని అన్నారు. తాము అతని వద్దకు వెళ్లి అడగ్గా మరోచోట స్థలం ఇస్తానని నమ్మబలికాడని, అయితే రెండు సంవత్సరాలు గడిచినా స్థలం చూపకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

మంత్రిచొరవతో వృద్ధుడికి శస్త్రచికిత్స

ధర్మవరం, సెప్టెంబరు 2 : తను మోకాళ్ల నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్నానని మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన వృద్ధుడు బాలకొండ వెంకటేశ్ ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వద్ద వాపోయాడు. స్పందించిన మంత్రి ఆ వృద్ధుడికి తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించేలా కృషిచేశారు. శస్త్రచికిత్సల అనంతరం బాలకొండ వెంకటేశ్ సోమవారం మంత్రి కార్యాలయ ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో మంత్రి ప్రతినిధులు హరీశ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను మినహాయించాలి

కొత్తచెరువు సెప్టెంబరు 2 : మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులను పని సర్దుబాటు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ... 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులను వారు పనిచేస్తున్న మండలాల నుంచి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయడం సరికాదన్నారు. దీనిని యూటీఎఫ్ తరఫున వ్యతిరేకిస్తున్నామన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు వయోభారం, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారన్నారు. అలాంటి వారిని సర్దుబాటు కింద సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, నరేశ్‌కుమార్, బాబు, పెద్దన్న, రవీంద్రానాథ్, కిష్టప్ప, రవీంద్రారెడ్డి, సాలప్ప పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

గోరంట్ల, సెప్టెంబరు 2: పట్టణంలోని పాతస్టేట్‌బ్యాంక్ వద్ద శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి ప్రబోధ సేవా సమితి సభ్యులు వారం రోజులపాటు పూజలు నిర్వహించారు. ముగింపు వేడుకలను సోమవారం ఊరేగింపుతో ఘన ంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు వేణుగోపాల్, ఆదెప్ప తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 2: శ్రావణ మాసచివరి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆల యంలో స్వామి వారికి ఆకుపూజ చేశారు. కావలికొండపైకి అనేక మంది భక్తులు కాలినడకన చేరుకుని ఆంజనేయస్వామికి మొక్కులు సమర్పిం చారు. అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి.

గుడిబండ: కర్ణాటక ప్రాంతం కళూరహళ్లి వద్ద వెలసిన జుంజప్ప స్వామికి భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూలతో అలంకరిం చి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చాలా మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఎస్‌ఎస్‌గుండ్లు గ్రామంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'స్థలాన్ని ఆక్రమించారు'

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 2: గోరంట్లలో తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించారని, న్యాయం చేయాలని గోరంట్లకు ముగ్గురు ఉపాధ్యాయులు ఎస్పీ రత్నాకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులు మురళి, రంగారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వేనెంబరు 292-2లో 17 సెంట్లు 2011లో చలపతి వద్ద కొనుగోలు చేశామని, 2022లో చలపతి ఆ స్థలంలో రోడ్డు వేశాడని అన్నారు. తాము అతని వద్దకు వెళ్లి అడగ్గా మరోచోట స్థలం ఇస్తానని నమ్మబలికాడని, అయితే రెండు సంవత్సరాలు గడిచినా స్థలం చూపకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి: ఏపీటీఎఫ్

పెనుకొండ, సెప్టెంబరు 2 : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ చీకటి దినంగా అభివర్ణిస్తు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సోమవారం ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ నాగరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొనసా గించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప... ఏ ఇతర ప్రత్యామ్నాయ విధానాలు తమకు ఆమోదయోగ్యంకాదని తేల్చిచెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ 20సంవత్సరాల కోరికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు

నిడుగల్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం: ఎంపీ



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, వేదిక సభ్యులు

పావగడ, సెప్టెంబరు 2 : రెండో హంపీగా పేరుగాంచిన నిడుగల్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎంపీ గోవింద కారజోళ పేర్కొన్నారు. శ్రావణ మాస చివరి సోమ వారం సందర్భంగా నిడుగల్ ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిడుగల్ ప్రాం తంలోని పరిసరాలు, దేవాలయాలు, పురాతన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయ న్నారు. మలే నాడును తలపించేలా ఉన్నాయన్నారు. వాల్మీకి సంజయ్ కుమార్ స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిడుగల్ ఉత్సవాలు ప్రభు త్వం తరుపున జరిపించేందుకు తన వంతు కృషిచే స్తానని తెలిపారు. నిడుగల్ ఉత్సవాలను ప్రభుత్వం తరపున జరిపించేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు.

రోడ్లు ఇలా... ఇళ్లకు చేరేదెలా?



మారుతి లేఅవుట్ వద్ద బురదమయమైన రోడ్డు



టీచర్స్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

పట్టణంలో చాలా ప్రాంతాలకు రోడ్లు, డ్రైనేజీలేని వైనం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 2: ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా హిందూపురం ప్రసిద్ధి. కర్ణాటక రాజధాని బెంగళూరు దగ్గరగా ఉండటంతో వ్యాపార, వాణిజ్య కేంద్రంగా మారింది. అయితే అభివృద్ధి విషయంలో వెనుకబడి ఉంది. పట్టణంలోని ప్రముఖ ప్రాంతాలైన టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డు, కరెంటు రంగప్ప లే అవుట్, డీఆర్ కాలనీ, శ్రీకంఠపురం పాత ఊరు, సీపీఐ కాలనీ పక్కన తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వర్షం కురిసిందంటే నరకం అనుభవిస్తున్నారు. ఇళ్లకు వెళ్లే దారులు బురదమయమై ద్విచక్రవాహనాలు కాదు కదా, కనీసం కాలిన డకన వెళ్లలేని పరిస్థితి దాపురిస్తుంది. ఇది ఇలా ఉంటే... పలు ప్రాంతాల్లో ఇప్పటికీ డ్రైన్లు లేక మురుగునీరు రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో పరి సర ప్రాంతాలు దుర్గంధభరితమై ఉంటాయి. వర్షం కురిసినప్పుడు వర్షం నీటితో కలిసి మురుగు కలిసిపోయి రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో మురు గునీరు నిలువ ఉండి దోమలకు నిలయాలుగా మారుతాయి. పరిసర ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అతి చిన్న పట్టణాలైన మ డకశిర, పెనుకొండల్లో రోడ్లు వెడల్పు చేసినా, హిందూపురంలో అం దుకు నోచుకోలేదు. ఇదిలాఉంటే ఆర్అండ్‌బి రోడ్లు, మునిసిపల్ రోడ్లు గుంతల మయమై పూర్తిగా అధ్వానంగా మారాయి. కొత్త వారు ఎవరైనా ఒక్క సారి హిందూపురంలో ప్రయాణిస్తే భయపడక తప్పదు. ముక్కుపిండి ప న్నులు వసూలు చేసే మునిసిపల్ అధికారులు రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చే యరా అని ప్రజలు నిలదీస్తున్నారు. పురం వైసీపీ పాలకుల నిర్లక్ష్యం పట్టణ ప్రజలకు శాపంగా మారిందని నిందిస్తున్నారు. అభివృద్ధిపై కౌన్సిల్ సమావేశాల్లోనూ ప్రశ్నించారు. అయితే నిధులు రాకపోతే తామేమి చేయాలని సమాధానాలు చెప్పడం వారివంతైంది. ఇప్పుడు టీడీపీ కూటమి పాలకులైనా పురం అభివృద్ధిపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధుల కోసం ఎమ్మెల్యే కృషి

చాలా ప్రాంతాలు పట్టణానికి దూరంగా ఉన్నాయి. ఎక్స్‌టెంక్షన్ ప్రాంతాలకు రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యేక నిధుల కోసం ప్రభుత్వంతో మాట్లాడుతున్నారు. త్వరలో రూ. 82 కోట్లు నిధులు రావచ్చు. అవి వస్తే పట్టణంలో రోడ్లు, డ్రైన్లు అన్నీ పూర్తిగా నిర్మించి సమస్యలు లేకుండా చేయాలని ప్రణాళిక రూపొందించాం. ప్రస్తుతం మునిసిపాలిటీలో నిధులు లేవు.

- మున్సిపల్ కమిషనర్, శ్రీకాంత్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



ఆర్ అనంతపురంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, సెప్టెంబరు 2 : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచే స్తున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షు డు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నా రు. వారు సోమవారం మండలంలోని ఆర్ అనంతపురంలో బ్లాక్ ప్లాం టేషన్ కింద చేపట్టిన మొక్కలు నాటే కార్యక్ర మంలో పాల్గొన్నారు. అనంతరం బుళ్ళస ముద్రం గ్రామంలో జనసేన నాయకు లు ఏర్పాటుచేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన రోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మా ట్లాడుతూ... నియోజకవర్గం అభి వృద్ధి లో భాగంగా అర్ అనంతపురం వద్ద ఎలె క్ట్రానిక్ పరిశ్రమల కోసం 1650 ఎకరాల భూములు సేకరించామని తెలిపారు. అ లాగే మడకశిరకు బైపాస్ కెనాల్, రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు అనుమతించా రన్నారు. మడకశిర మండలానికి అతి పెద్ద సోలార్ ప్రాజెక్ట్ రానుందని, అందుకోసం 6300 ఎకరాల భూముల సేకరణకు ప్రతిపాదనలు సి ద్ధం చేసినట్లు తెలిపారు. రైతులందరూ సహకరించా లని కోరారు. అర్హులైన వారికి పింఛన్లు, ఇళ్లు మంజూరుచేస్తామన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక : మండలంలోని బుళ్ళసముద్రం, ఆర్ అనంతపురం పంచాయతీ ల్లోని వైసీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువు రు నాయకులు, కార్యకర్తలు సోమవారం టీడీపీలోకి చేరారు. బుళ్ళసముద్రంలో వైసీపీ నుంచి వంద కుటుంబాలు, ఆర్ అనంతపు రం నుంచి అనేక మంది టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి వారికి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచు జైపాల్, నాగేంద్ర, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అత్యధికులు ఉద్యోగాలు సాధించాలి

మడకశిరటౌన్ : మడకశిర లాంటి వెనకబడిన ప్రాంతాల్లో సైతం అత్యధిక మంది ఉపాధ్యాయ పోస్టులు పొందాలన్న లక్ష్యంతోనే డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఆయన సోమవారం సందర్శించారు. అభ్యర్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

సింగిల్ విండో విధానంలో మండపాల ఏర్పాటుకు అనుమతులు : డీఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 2: వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ విగ్రహ మండపాల ఏర్పాటుకు సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీ ఎస్పీ మహేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతుల కోసం ఇచ్చినక్యూఆర్‌కోడ్‌లు ఉత్సవాలు నిర్వహించే అందరి వద్ద అందుబాటులో ఉండాలన్నారు. అగ్నిమాపకశాఖ, మునిసిపల్‌శాఖ, విద్యుత్‌శాఖ, పోలీస్ శాఖ నుంచి ఎన్‌ఓసీ పత్రాలు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు 7995095800కు వాట్సప్ ద్వారా సందేశం పంపితే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ కోసం వాట్సప్‌లోనే మెసేజ్ వస్తుంద న్నారు. అనుమతులు పొందేవారు గణేష్ ఉత్సవ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తే అందులో అన్ని నిబంధనలు పొందు పరిచి ఉంటాయని తెలిపారు.

బ్యాంకర్లు సహకరించండి: ఏడీజే

హిందూపురం, సెప్టెంబరు 2 : స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 14న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌కు బ్యాంకర్లు సహకరించాలని అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ సూచించారు. న్యాయాధికారి సోమవారం స్థానిక కోర్టు ఆవరణంలో పలు బ్యాంకుల అధికారులు, న్యా యవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ ... పలు బ్యాంకుల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రుణాలకు సంబం ధించి బ్యాంకర్లు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయా బ్యాంకుల పరిధిలో రాజీకాదగ్గ కేసులన్నీ లోక్‌అదాలత్‌కు సిఫార్సు చేయాలన్నారు. బ్యాంకులకు సంబంధించి న్యాయ వాదులు సహకరించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి లలితలక్ష్మి, బార్ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు, బ్యాంక్ మేనేజర్లు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 2 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో ప్రత్యేక దృష్టిసారించి అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సరస్వతి.. స్థానిక అధికారులకు సూచించారు. సోమందేపల్లిలోని మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ... వర్షంవల్ల చెరువులు, కుంటలు, డ్యామ్‌లు నీటితో నిండి ఉన్నాయన్నారు. అవి తెగిపోకుండా, గండిపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్ప టికప్పుడు సమీక్షిస్తూ సమా చారాన్ని అందించాల న్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలన్నా రు. పాత మిద్దెల్లో నివాస ముంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలిం చాలన్నారు. ఈ కార్యక్రమం లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శంకర్, ప్రభుత్వ వైద్యులు ఓంకార్, ఇన్‌చార్జి ఈఓఆర్డీ శ్రీధర్ పాల్గొన్నారు.

మడకశిర రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్ర మత్తంగా ఉండాలని డాక్టర్ వినోద్ తెలిపారు. మండలం లోని బుళ్ళసముద్రం గ్రామం లో సోమవారం 104 వాహ న క్యాంపు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

పురంవాసి ప్రతిభ

అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సంగీత విద్వాంసుడి నుంచి ధ్రువ పత్రం అందుకుంటున్న చతుర్వేది

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 2: పట్టణానికి చెందిన నృత్యకారిణి చంద్రబాను చతు ర్వేది భరతనాట్యంలో ప్రతిభ కనబరచి, అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని కాశీవిశ్వనాథుడి సన్నిధిలో సోమవారం నిర్వహించి న అంతర్జాతీయ నృత్య పోటీల్లో ఆమె తన బృందంతో కలిసి పాల్గొన్నారు. 9 వేల మంది నృత్య కారిణులు భరతనాట్యం, కూచిపూడి, కథక్ తదితర నృత్యాలు చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచినందుకు మృదంగ విద్వాం సుడు, పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తర్వలో మలేసియాలో నిర్వహించే నృ త్యపోటీల్లో ఆమె పాల్గొననున్నారు. దేశం నలుమూలల నుంచి నృత్యకారినులతోపాటు మలేసియా, కాలిఫోర్నియా తదితర దేశాల నుంచి కూడా నృత్యకారిణులు వచ్చారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

గుడిబండ : మండలంలోని ఎస్ రాయాపురానికి చెందిన వీరక్యాత రాయప్ప అనే పింఛన్ లబ్ధిదారుడు అనారోగ్యానికి గురై తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్నాడు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్రప్ప, లైన్‌మన్ పోతరాజు సోమవారం ఆసుపత్రికెళ్లి లబ్ధిదారుడికి రూ.4వేలు పింఛన్ అందజేశారు.

బాలయ్య గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో చిలమత్తూరు నాయకులు



హైదరాబాదులో ఆది వారం జరిగిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే బాల కృష్ణకు శుభాకాంక్షలు తెలు పుతున్న టీడీపీ చిలమ త్తూరు మండల నాయకు లు. - చిలమత్తూరు

డీ ఫార్మసీలో సత్తాచాటిన పురం విద్యార్థినులు



జయలక్ష్మి



షాయిస్తా ఫిర్దోస్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 2: డీ ఫార్మసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ హరీష్ తెలిపారు. పి జయలక్ష్మి 1000/985, ఎస్ షాయిస్తా ఫిర్దోస్ 1000/975 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారన్నారు. అదే విధంగా కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థినులు 17 మంది 90శాతం పైగా మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరం నుంచి నాలుగో సం వత్సరం వరకు విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి : యూటీఎఫ్

మడకశిరటౌన్, సెప్టెంబరు 2: యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, జిల్లా నాయకులు కోరారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని వారు సోమవారం పరిశీలించారు. క్రీడా పోటీల్లో పాల్గొనేవారు సెల్ ఫోన్ నంబర్లు 9398207145, 9676059442ను సంప్రదించాలన్నారు.



పురంలో మొక్కనాటుతున్న కొల్లకుంట అంజినప్ప, ఆకుల ఉమేష్



పెనుకొండలో కేక్ కట్‌చేస్తున్న ఎంపీ బీకే, జనసేన నాయకుడు లోకేష్

ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం కూటమి నాయకులతో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. హిందూపురంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప , టీడీపీ, జనసేన నాయకులు కొల్లకుంటలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. గురునాథ్ థియేటర్ వద్ద కేక్‌కట్ చేశారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలో జనసేన మండల కన్వీనర్ జబీవుల్లా ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పెనుకొండలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ బీకే పార్థసారథి, జనసేన పట్టణ అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేశారు. అలాగే పెనుకొండ పట్టణంలో బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద అన్నదానం చేపట్టారు. గోరంట్లలో జనసేన నాయకులు, అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.



అంబేద్కర్ సర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు

సీఐ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. మండలకేంద్రాలైన పరిగిలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు కేక్‌కట్‌చేశారు. లేపాక్షిలోని స్థానిక బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. చిలమత్తూరులో జనసేన నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఎస్ఐ మున్సీర్ అహమ్మద్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఆయా ప్రాంతాల్లో అన్నదానం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పేదలకు దుస్తుల పంపిణీ తదితర సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

సూపర్‌మార్కెట్ పేరిట బురిడీ

●ప్రభుత్వ టీచర్‌పై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2: ఈ-స్టోర్ ఇండియా సూపర్ మార్కెట్ పేరుతో ఓ ప్రభుత్వ టీచర్ కొందరిని బురిడీ కొట్టించాడు. ఏకంగా రూ.కోటి దోచేశాడు. తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లిస్తాడని రెండేళ్లపాటు ఎదురుచూసిన బాధితులు ఎస్పీ జగదీ ష్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు రామలక్ష్మిరెడ్డి, వేణుగోపాల్, కవిత, పద్మలత, శ్యాంసుందర్‌రెడ్డి, శాంతికుమారి ఎస్పీని కలిశారు. హిందూపురం పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ సైఫుల్లా పరిగి ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ-స్టోర్ ఇండియా సీఎండీతో దిగిన ఫొటోలు చూపించి తమను నమ్మించాడని, రూ.కోటితో సూపర్‌మార్కెట్ పెడితే 3 నెలల తరువాత నెలకు రూ.4లక్షలు, మార్కెట్‌లో జరిగే టర్నోవర్‌లో ప్రతి నెలా 5శాతం కమీషన్ ఇప్పిస్తామని నమ్మించాడని ఫిర్యాదులో పేర్కొన్నా రు. ఆరుగురం కలిసి యాక్సిస్ ఈ-గ్రూప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.కోటి ట్రాన్స్‌ఫర్ చేశామని తెలిపారు. మూడు నెలల తరువాత అడిగితే మరో మూడు నెలలు గడువు చెప్పాడని, ఇలా ఏడాదికి పైగా కట్టుకథలు చెబుతున్నాడని ఎస్పీకి వివరించారు. డబ్బు ఇవ్వకుండా, సూపర్‌మార్ట్ ఏర్పాటు చేయకుండా మోసగించాడని, నిలదీస్తే ఏం చేసుకుంటారో చేసుకోండని దబాయిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 2 : గుర్తు తెలియని ఓ వ్యక్తి అమరాపురం మండలంలోని వలస గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటు వైపుగా సోమవారం వెళుతున్న గ్రామస్థులు గుర్తించి రెవెన్యూ అధికారు లకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులతో పాటు గ్రామ ప్రజలు అక్కడికి వెళ్లి పరిశీలించారు. కర్ణాటక సరిహద్దున, వలస రెవెన్యూ గ్రామ పరిధిలోని తమ్మడేపల్లి-మహదేవపురం వంక పక్కన ఉన్న చింత చెట్టు చివరి కొమ్మకు ఉరివేసుకున్నాడు. నెలరోజుల క్రితమే అతడు ఉరివేసుకుని ఉంటాడని వారు అభిప్రాయ పడుతున్నారు. సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండొచ్చని అంటున్నారు. శవం కొమ్మమీదపడి ఎండిపోయి ఉండగా, తల మొండెం నుంచి వేరుపడి చింత చెట్టుకు దక్షి ణ దిశలో సుమారు 50 మీటర్ల దూరంలో పడి ఉంది. వలస వీఆర్‌ఓ రమ్య ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ జనార్దన్ నాయుడు తెలిపారు. అక్కడే పోస్టుమార్టం చేయిస్తామని ఎస్ఐ తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని జిల్లేడగుంట గ్రామంలో ఉన్న తాగునీటి బోరు వద్ద లీకేజీకి అధికారులు మరమ్మతులు చేశారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'పైపులైన్ లీకేజీని పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో అధికారులు వెంటనే స్పం దించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, పంచాయితీ కార్యదర్శి వర దరాజులు గ్రామానికి వెళ్లారు. పైపులైన్ పరిశీలించి మరమ్మతులు పనులు చేపట్టారు. స్థానిక ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

5న తల్లిదండ్రుల సమావేశం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 2: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 5వ తేదీన తల్లితండ్రులు, పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో న్యాక్ అసిస్మెంట్, అక్రిడేషన్‌ను న్యాక్ అత్యున్నత కమిటీ మరో సారి కళాశాలను సందర్శిం చనున్నట్లు తెలిపారు. కావున 5 తేది మధ్యాహ్నం 2 గంటలకు కళాశాలలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులు, పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్న తెలిపారు.